క్లుప్తంగా

గురుకులలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ



ధరూరు: మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల గురుకుల డిగ్రీ కాలేజీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తనిఖీ చేశారు. గురువారం మధ్యాహ్నం ఆయన గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, డైనింగ్ హాల్ ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

నారుకు గడ్డిమందు స్ప్రే చేసిన దుండగులు



ఇటిక్యాల: రైతు పెంచుతున్న నారుమడికి గుర్తు తెలియని దుండగులు గడ్డిమందు స్ప్రే చేసిన సంఘటన మండలంలోని సాతర్ల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హరిజన మద్దిలేటి తన నాలుగు ఎకరాల పొలంలో మిరపపంట వేయడానికి కొద్ది రోజులుగా 50 ప్యాకెట్ల మిరపనారు పెంచుతున్నాడు. ఈ క్రమంలో గురువారం పొలంలోకి వెళ్లి చూడగా గుర్తు తెలియని దుండగులు మిరపనారుకు గడ్డిమందు స్ప్రే చేసినట్లు గుర్తించి లబోదిబోమన్నాడు. మరో రెండురోజుల్లో నారు నాటుకునేందుకు పొలం చదును చేసుకోగా, ఇంతలోనే ఇలా జరగడంతో ఆందోళన వ్యక్తం చేశాడు. నారు పెంచడానికి సుమారు రూ.50వేల ఖర్చు వచ్చిందని బాధితుడు పేర్కొన్నాడు.

ఉర్దూ ఉపాధ్యాయుడి కోసం వినతి




అలంపూర్: అలంపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జాఫరుల్లాకు విద్యార్థులు గురువారం వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో ఉర్దూ మీడియం ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థులు కోరారు. విద్యార్థుల వినతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు.

కొండచిలువ కోసం గాలింపు



అయిజ: పట్టణ సమీపంలోని జములమ్మ దేవాలయం పరిసర ప్రాంతాల్లో రెండు మూడురోజులుగా కొండచిలువ సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో గురువారం అటవీ శాఖ సిబ్బంది చిన్న, విజయ్‌లు కొండచిలువ కోసం జములమ్మ ఆలయ పరిసరాల్లో ముళ్ల పొదల్లో గాలించారు. ఎవరికైనా కొండచిలువ కనిపిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని అటవీశాఖ సిబ్బంది కోరారు.

పాఠశాలలో గ్రీన్‌డే కార్యక్రమం



అయిజ: మండల కేంద్రంలోని అక్షర ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రీన్‌డే నిర్వహించారు. పచ్చి కూరగాయలు, ఆకులు, ఆకుపచ్చ బెలూన్లతో పాఠశాల వాతావరణం హరిత వాతావరణంగా మార్చారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిల్లులు విడుదల చేయాలి

మానవపాడు: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని జిల్లా యూఎస్‌పీసీ అధ్యక్షుడు రమేష్ తెలిపారు. గురువారం యూఎస్‌పీసీ పిలుపు మేరకు మండల కేంద్రంలో యూఎస్‌పీఎస్‌సీ భాగస్వామ్య సంఘాలు తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భీసన్న, ప్రధాన కార్యదర్శి సురేష్, సీనియర్ నాయకులు వెంకటేష్, మద్దిలేటి, రమేష్, మౌలాలి, మల్లన్న, రామూర్తి పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

- అలంపూర్‌లో మాజీ మంత్రి పూజలు
- ప్రధాన ఆలయాల్లో భక్తుల సందడి

అలంపూర్: దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు అర్చక స్వాములతో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీజోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంతో పాటు పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయం, అల్వలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి, కోతులగిద్ద అరణ్జేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని డి.బూడిదపాడు ఆలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, ఆకుపూజ చేశారు. అనంతరం వీఎస్‌టీ ఆధ్వర్యంలో అన్నదానం, సీతారాముల విగ్రహాలను పల్లకీసేవలో ఆలయం చుట్టు ఊరేగించారు.

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి రథోత్సవం నిర్వహించారు.

ఘనంగా కలశం ఊరేగింపు

అయిజ: గాయత్రి పరివార్ సనాతన ధర్మం సభ్యులు హరిద్వార్ నుంచి రథయాత్ర ద్వారా తెచ్చిన కలశంను బింగుదొడ్డి గ్రామంలో భాజాభజంత్రీలతో, డోలు వాయిద్యంతో ఘనంగా ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావుల చెర్వు గట్టు తిమ్మప్పస్వామి, చర్లగార్లపాడు వెంకటేశ్వరస్వామి, శేషంపల్లి శివసీతారామస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గద్వాల పట్టణంలో ప్రైవేట్ పాఠశాల యజమాన్యం అన్నదానం చేశారు.

మానవపాడు మండలంలోని ఆయా గ్రామాలలో అమావాస్య పూజలను ఆలయాల్లో ప్రత్యేకంగా నిర్వహించారు. ఆలయాల్లో అభిషేకాలు, ఆకుపూజలు, అన్నదానం నిర్వహించారు. అమరవాయి లో అన్నదానం నిర్వహించారు.

అమావాస్య ప్రత్యేక పూజలు

రాజోళి మండల కేంద్రం, ఆయా గ్రామాల్లో అమావాస్య సందర్భంగా వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలో, ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



బింగుదొడ్డి గ్రామంలో కలశాన్ని ఊరేగిస్తున్న భక్తులు



వెంకటాపురం పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



అలంపూర్ ఆలయాల దర్శనానికి విచ్చేస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

జీవితంలో ఉన్నత పదవుల్లో రాణించాలి



అలంపూర్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు



గద్వాలలో కేటీఆర్ జన్మదిన వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు

ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాజకీయ జీవితంలో ఉన్నత పదవుల్లో రాణించాలని ఎమ్మెల్యే విజయుడు ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకోని ఎమ్మెల్యే విజయుడు అలంపూర్ క్షేత్ర ఆలయాలను గురువారం దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కర్ణసింహారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రుక్మొద్దీన్, పరుశురాముడు, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

● అలంపూర్ పట్టణంలోని టూరిజం హోటల్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అలంపూర్ చౌరస్తాలో ఆర్ కిషోర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పీహెచ్‌సీలో పండ్ల పంపిణీ

అయిజ: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

గద్వాల: మాజీ మంత్రి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం పురస్కరించుకుని బీఆర్‌ఎస్‌వీ నాయకులు జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో పాఠకులకు నోట్‌బుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు.

గద్వాలటౌన్: బీఆర్‌ఎస్ నాయకుడు హనుమంతునాయుడు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు రక్తదానం, జిల్లా ఆస్పత్రి ఆవరణలో అన్నదానం చేశారు. జిల్లా కేంద్రంలోని రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చి శ్రమదానం చేశారు.

● కేటీదొడ్డి మండల కేంద్రంలో కేక్‌కట్ చేసి కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ నాయకులు నర్సింహులు, వీరన్న, కిష్టప్ప, గోపాల్ ఉన్నారు.

● ఎర్రవల్లి మండలంలోని కొండేరులో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తారక రామారావు జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీదర్‌రెడ్డి హెల్త్ సబ్ సెంటర్లో బాలింతలకు, గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆశా కార్యకర్త జయమ్మ

అలంపూర్ రూరల్: సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ భరత్ అన్నారు. గురువారం మండల వైద్యాధికారి డాక్టర్ భరత్ 'సాక్షి'తో మాట్లాడుతూ వానాకాలం రావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదని, భోజనం చేసేముందు, మాల విసర్జన తరువాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. దోమకాటు వల్ల డెంగీ, మలేరియా, చికన్‌గున్యా తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉన్నారన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించి సూచనలు అందిస్తున్నామన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలలోని విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించారు. ప్రతి గురువారం పాఠశాలల సందర్శన చేపడతారన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

గద్వాలటౌన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా పోరాటం సాగిస్తామని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు హెచ్చరించారు. కమిటీ నాయకులు తహసీల్దార్ కార్యాలయ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అధికారికి వినతిపత్రం అందజేశారు.

ఇటిక్యాల: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నందినికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉదయ్ కిరణ్, రాజశేఖర్, తిమ్మప్ప, రవికుమార్, రాంబాబు, కర్ణాకర్, రఘువులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: విద్యారంగంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మండల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉదయ్ కిరణ్, రాజశేఖర్, తిమ్మప్ప, రవికుమార్, రాంబాబు, ఆర్థర్, బాలకృష్ణ, కర్ణాకర్, రాఘవులు ఉన్నారు.



గద్వాలలో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

గట్టు: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి(యూఎస్‌పీసీ) సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా పోరాటం చేయనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. 317జీఓ ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాకు పంపాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. 30డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో చంద్రకాంత్ వదన్, ఊసేనప్ప, సూరి పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

రాజోళి: వడ్డేపల్లి మున్సిపాలిటీ అధికారులకు ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం తగదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. శాంతినగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 15 రోజుల కిందట శాంతినగర్‌లోని రామచంద్రానగర్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలపై వినతి పత్రం అందచేస్తే నేటి వరకు ఒక్క అధికారి కూడా అటువైపు తిరిగి చూడలేదని, విధుల్లో ఇంత నిర్లక్ష్యంగా ఉండే అధికారులు తమ తీరు మార్చుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్,పరుశరాముడు, మోహన్‌రావ్,వినోద్, మోహన్ యాదవ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిస్తాం



మానవపాడు: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడిగే బాధ్యత భారతీయ జనతా పార్టీకి మాత్రమే ఉందని మండల ప్రబారి నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో స్థానిక సంస్థల సన్నాహక కార్యక్రమం బీజేపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రాజశేఖర్‌శర్మ, బలరామిరెడ్డి, లక్ష్మీనారాయణ, రాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జయంతి



ఇటిక్యాల: మండలంలోని షాబాద్ గ్రామంలో గురువారం ఆషాడ అమావాస్య సందర్భంగా చౌడేశ్వరిదేవి జయంతి ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

మహిళా డిగ్రీ కళాశాలలో గోరింటాకు వేడుకలు



గద్వాలటౌన్: ప్రియదర్శిణి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం కళాశాల ఆవరణలో జరిగిన వేడుకలను ప్రిన్సిపాల్ మీనాక్షి ప్రారంభించారు. విద్యార్థినులు ఉత్సాహంగా గోరింటాకు పెట్టుకుని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సమత, వనిత, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర పరిష్కారం అందించాలి

గద్వాల: వివిధ రకాల సమస్యలతో కార్యాలయానికి వచ్చే ప్రజలకు సత్వర పరిష్కారం చూపేలా పనిచేయాలని అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్, డీటీలు, సిబ్బందితో మాట్లాడారు. ముఖ్యంగా భూ భారతి దరఖాస్తులను పరిశీలించారు. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. సమస్య పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్, డీటీలు రామకృష్ణ, అజిత్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



దరఖాస్తుదారుడితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ

ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఉండాలి

ధరూరు: ప్రతి విద్యార్థికి చదువు ఎంత ముఖ్యమో.. వివిధ పుస్తకాల ద్వారా లభించే జ్ఞానం కూడా అంతే ముఖ్యమని ధరూరు స్కూల్ కాంప్లెక్స్ జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయనతో పాటు ఎంఈఓ రవీంద్రబాబు హాజరయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు గుణాత్మకమైన విద్యనందించాలన్నారు. ఎల్‌ఎఫ్‌ఎన్ పరీక్ష గురించి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్ ప్రకాష్, అస్లాం, చక్రవర్తి, మహేష్, రాఘవాచారి, సీఆర్‌పీ నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్కూల్ కాంప్లెక్స్ జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి

సీడ్‌పత్తి పంట కొనుగోలు చేయాలి



రాష్ట్ర వ్యవసాయ శాఖ అడిషనల్ కమిషనర్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గద్వాల: గద్వాల జిల్లాలో సాగు చేసిన సీడ్‌పత్తి ఉత్పత్తులను మొత్తం కొనుగోలు చేయాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్ కోరారు. గురువారం సీపీఎం నాయకులు, సీడ్ పత్తి రైతులతో కలిసి హైదరాబాద్‌లోని రాష్ట్ర వ్యవసాయ అడిషనల్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీడ్‌పత్తి కంపెనీలు ఇచ్చిన విత్తనాలను తీసుకున్న రైతులు జిల్లా వ్యాప్తంగా సుమారు 40వేల ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతులు పండించిన సీడ్‌పత్తి ఉత్పత్తిని కొనుగోలు చేయడంలో ఆంక్షలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేసినట్లు తెలిపారు. సీడ్ కంపెనీలు రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.1లక్ష ఇవ్వాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో నాయకులు శోభన్‌నాయక్, వెంకటస్వామి, వివి నర్సింహ, శ్రీరామ్, వీరేష్, ఉరుకుందు, నారాయణ, తిమ్మప్ప పాల్గొన్నారు.

బోరవెల్లిలో కేంద్ర బృందం సందర్శన



బోరవెల్లిలో కేంద్ర పథకాల వివరాలు సేకరిస్తున్న కేంద్రబృందం సభ్యులు

మానవపాడు: మండలంలోని బోరవెల్లిలో గురువారం కేంద్రబృందం ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీన్ పథకం పరిశీలించారు. ఎస్‌బీఎమ్ డైరెక్టర్ ఆర్డినేటర్ పరుశరాము, ఏఎమ్‌ఎస్ సతీష్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలైన మరుగుదొడ్లు, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను పరిశుభ్రంగా ఉన్నాయా? లేదా అని పరిశీలించారు. ఎస్‌బీఎమ్ ద్వారా నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సప్తాహ భజన



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తాహ భజనలు కొనసాగుతున్నాయి. గురువారం జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన భజన మండలి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్ రావు, అర్చకులు రమేషాచారి, రవి చారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రఘునాథ్‌గౌడ్‌ను అరెస్టు చేయాలి



గద్వాల: ప్రేమపేరుతో పెళ్లిచేసుకుంటానని మాయ మాటలు చెప్పి లోబర్చుకుని మోసం చేసిన కానిస్టేబుల్ రఘునాథ్‌గౌడ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ప్రజా, కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం స్థానిక కృష్ణవేణి చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఖమ్మం జిల్లా పాల్వంచ పట్టణానికి చెందిన ప్రియాంకను ప్రేమ, పెళ్లి పేరుతో లోబర్చుకుని ఉద్యోగం వచ్చిన తరువాత తక్కువ కులం వాళ్లను చేసుకోమని అవమానపర్చిన రఘునాథ్‌గౌడ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మోహన్, ప్రభాకర్, వాల్మీకి, భాస్కర్, తిమ్మోజి, మక్బుల్, పూజారి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



గద్వాల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే అన్నారు. ఈమేరకు ఆమె గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రామాంజనేయులు, రాంచంద్రారెడ్డి, బండల వెంకట్రాములు, మాణిక్యారెడ్డి, శ్యాంసుందర్, బలరాంరెడ్డి, రజకజయశ్రీ, వెంకటేశ్వర్‌రెడ్డి, అనిల్, దేవదాసు, తిరుపతిరెడ్డి, శ్రీపాదరెడ్డిపాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



ఉండవెల్లి: మండల కేంద్రంలోని బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గురువారం ఆషాడ మాసం చివరి రోజు సందర్భంగా హేమలాంబ అమ్మవారికి బోనాలతో మహిళలతో ఐటీఐ కళాశాల నుంచి హేమలాంబ ఆలయానికి ఊరేగింపుగా నిర్వహించారు. ఎస్‌ఐ శేఖర్ బోనాల పండుగలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి, రాముడు, రఘువీర్ సింగ్, రవి గౌడు, ఖాదర్, తదితర్లు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



అలంపూర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలిచిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అడ్డాకుల రాము అన్నారు. అలంపూర్ పట్టణంలో ఇద్దరు లబ్ధిదారులకు బెస్మెంట్ బిల్లులు పడటంతో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. జిల్లాలోనే మొట్టమొదటి లబ్ధిదారులుగా నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నాయకులు మిఠాయిలు తినిపించారు.

మార్కింగ్ త్వరగా పూర్తి చేయాలి

గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ పద్మావతి అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారుల మార్కింగ్ సకాలం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. బెస్మెంట్‌లు కట్టుకున్న లబ్ధిదారుల లాగిన్‌లో ఫొటో క్యాప్చర్ చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.